నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | NIZAMABAD



రాజీవ్‌నగర్ తండాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

## సేవాలాల్ ఆశయ సాధనకు కృషిచేయాలి

కంఠేశ్వర్, ఫిబ్రవరి 15: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషిచేయాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలను గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని మహరాజ్ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సంత్ సేవాలాల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు, గిరిజన ప్రతినిధులు

## బాన్సువాడ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



టీయూ రిజిస్ట్రార్ నుంచి గుర్తింపు పత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపాల్ గంగాధర్

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 15: బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) గుర్తింపు రావడంతోపాటు తెలంగాణ యూనివర్సిటీ ఆమోదం లభించింది. అటానమస్ గుర్తింపు ఆదేశాల పత్రాన్ని టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ యాదగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి గుర్తింపు రావడం ఆనందకరమన్నారు. కళాశాలలో బాన్సువాడతోపాటు చుట్టుపక్కల మూడు నియెజకవర్గాలు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అటానమస్ గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తంచేస్తూ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పటాకులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

## ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోంది

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల

రెంజల్, ఫిబ్రవరి 15: తెలంగాణ ప్రజలను మోసం చేయడమే పనిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ విమర్శించారు. రెంజల్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత చక్కెర కర్మాగారంపై మంచి నిర్ణయం తీసుకుంటుందనుకున్న కార్మికులకు నిరాశే మిగిల్చారని అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఈ విషయమై మాట్లాడకపోవడం విడ్డూరమన్నారు. గతంలో చేసిన హౌస్ క మి టీ సిఫారసులను విస్మరించి మరో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. రెంజల్‌లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. ఎంపీపీ లోలపు రజిని, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్‌కు కేటీఆర్ పరామర్శ



మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి కాలికి మైనర్ శస్త్రచికిత్స జరిగింది. గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో పోచారాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

– బాన్సువాడ, ఫిబ్రవరి 15

# ఎదురుచూపులే..

- 17ఏండ్లుగా ఇందూరు విద్యార్థుల నిరీక్షణ
- టీయూలో ఇంజినీరింగ్ కల నెరవేరేనా
- పట్టించుకోని వర్సిటీ అధికారులు
- విశ్వ విద్యాలయంపై పాలకుల చిన్నచూపు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. గత విద్యా సంవత్సరంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. జగిత్యాల, మంచిర్యాల, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, వనపర్తికి ఇదివరకే కాలేజీలు వచ్చేశాయి. ఆదిలాబాద్‌లో కళాశాల ఏర్పాటుపై గతేడాదే ప్రకటన వచ్చినా.. అప్పటికే కౌన్సెలింగ్ తేదీలు ముగియడంతో ప్రారంభానికి వీలుకాలేదు. కానీ నిజామాబాద్‌లో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటై 17ఏండ్లు గడుస్తున్నా ఇంజినీరింగ్ కళాశాలకు నోచుకోలేదు. వర్సిటీ అధికారుల ప్రయత్నం లేకపోవడమే ఇందుకు కారణం. ఇప్పటికైనా చొరవ చూపితే వచ్చే విద్యాసంవత్సరానికైనా జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించుకునే వీలుంటుంది.

### పట్టించుకునే వారేరి?

టీయూ మూడు ప్రాంగణాలతో కొనసాగుతున్నది. వర్సిటీ ప్రారంభించినప్పుడే ప్రధాన ప్రాంగణంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత కోర్సులను ప్రారంభించడంలో పాలకవర్గంలో ఉన్నవారు, అధికారులు విఫలమయ్యారు. టీయూ పాలకవర్గంలోని వ్యక్తులు తరచూ వివాదాల్లో చిక్కుకోవడంతో ఈ దిశగా ప్రయత్నాలు జరుగలేదు. రెండేండ్ల క్రితం జేఎన్టీయూ అధికారులు జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు ముందుకొచ్చినా, ప్రభుత్వం నుంచి అ ను మ తు లు లభించలేదు.

> రాష్ట్రం పేరిట ఉమ్మడి జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన తెలంగాణ యూనివర్సిటీకి ప్రాధాన్యం కరువైంది. పాలకుల అశ్రద్ధ, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. వందల సంఖ్యలో ఉన్న కళాశాలలకు కేంద్రబిందువైన విశ్వవిద్యాలయంలో.. ఓ ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడం శోచనీయం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా.. ఇప్పటి వరకూ ఆ దిశగా ప్రయత్నాలు జరుగకపోవడం విడ్డూరం.
>
> – డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15

### విద్యాశాఖ కార్యదర్శినే ఇన్‌చార్జి వీసీ..


తెలంగాణ వర్సిటీ ఉపకులపతిగా పనిచేసిన రవీందర్ గుప్తా అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను విద్యాశాఖ కార్యదర్శికి అప్పగించారు. ప్రస్తుతం ఈ హోదాలో ఉన్న బుర్రా వెంకటేశం తాజాగా కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇదే తరుణంలో టీయూలో ఇంజినీరింగ్ కోర్సుల ప్రారంభ అవశ్యకతను పరిపాలనా పదవుల్లో ఉన్నవారు ఇన్‌చార్జి వీసీ దృష్టికి తీసుకెళ్తే అనుమతులు వచ్చే అవకాశమున్నది.

### ఇప్పటినుంచే ప్రయత్నించాలి..

వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అందుబాటులో ఉంది. ఈ ఫ్యాకల్టీతోనే కోర్సులను ప్రారంభించుకునే అవకాశం ఉన్నది. కళాశాల ఏర్పాటయ్యాక కోర్సుల ఆధారంగా నియామకాలపై దృష్టి సారించవచ్చని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఇంజినీరింగ్ విద్య అందుబాటులోకి తేవాలంటే ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతులు తప్పనిసరి. ఇందుకు వర్సిటీ అధికారులే ముందుగా చొరవచూపాలి. ఇప్పటి నుంచే ఆ ప్రక్రియ ప్రారంభిస్తే వచ్చే విద్యాసంవత్సరానికైనా కోర్సులు మంజూరయ్యే అవకాశముంటుంది.

### జేఎన్టీయూ ప్రతిపాదనలపై ఆలోచించాలి..

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు జేఎన్టీయూ ముందుకొచ్చింది. ఇందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం కోసం ఇదివరకే ప్రతిపాదనలు కూడా పంపింది. ఇవి విద్యాశాఖ వద్దే ఉన్నాయి. మన ప్రాంత వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ఉన్న బుర్రా వెంకటేశం.. ప్రస్తుతం విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యా కమిషనర్‌గా ఉన్నారు. ఆయన చొరవ చూపితే జేఎన్టీయూ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఆమోద ముద్రపడి జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటయ్యే అవకాశముంది. ఈ దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు సైతం కృషి చేయాలని జిల్లా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.




## స్కిల్ డెవలప్‌మెంట్‌ను కొనసాగించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సబబు కాదు
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 15: బాల్కొండ నియోజకవర్గంలో న్యాక్ ద్వారా మంజూరు చేయించిన నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సబబు కాదని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం శాసనసభ సమావేశంలో అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి నిరుద్యోగ యువత ఉపాధి కోసం పెద్ద ఎత్తున గల్ఫ్ దేశాలకు వెళ్తారని గుర్తుచేశారు. బాల్కొండ నుంచి 18వేల మంది గల్ఫ్ దేశాల్లో ఉంటారన్నారు. గల్ఫ్ వెళ్లే నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణనందిస్తే మంచి వేతనాలు, ఉద్యోగాలు లభిస్తాయన్న ఆశయంతో అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా న్యాక్ శిక్షణ కేంద్రాన్ని తాను మంజూరు చేయించానన్నారు. శిక్షణ కేంద్ర భవన నిర్మాణం ప్రారంభించుకునే సమయంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సెంటర్‌ను రద్దు చేయడం నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సభలో వివరించారు. ప్రస్తుత మంత్రి ఆలోచించి మంజూరైన శిక్షణ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని విన్నవించారు.

### రాష్ట్రంలోనే ఎత్తయిన రథం..

గద్వాలకు చెందిన ప్రముఖ శిల్పి బైరోజు బాలబ్రహ్మాచారి నేతృత్వంలో 10 మంది కళాకారులు నూతన రథాన్ని తయారు చేశారు. మహారాష్ట్రలోని అడవుల నుంచి తెచ్చిన పెదవెగుకర్రను ఉపయోగించారు. గద్వాలలోనే కర్రపై చెక్కిన శిల్పాలను తయారుచేసి ఇక్కడకు తెచ్చి రథానికి అమర్చారు. 28.5అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పు, 5 అంతస్తుల్లో వైవిధ్యభరితమైన శిల్పాలతో రథాన్ని ఆవిష్కరించారు. శివలింగం, నంది ఇరువైపులా గణపతి, కుమారస్వామి మరో వైపు అమ్మవారు, ద్వార పాలకులు, ఏనుగులు, గుర్రాలు ఇలా రథంపై చెక్కిన శిల్పాలు ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరులో హంపీ ఆలయానికి వినియోగించిన నాలుగు ఏకశిలతో రథచక్రాలను తయారు చేయించారు. ఒక్కో చక్రం బరువు ఒకటన్ను ఉంటుంది. రాష్ట్రంలోనే ఎత్తయిన రథంగా భక్తుల గుర్తింపు పొందింది.


## రథం సిద్ధం

- ముస్తాబైన నీలకంఠేశ్వరాలయం
- నేడు రథసప్తమి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 15: భక్తుల పాలిట కొంగు బంగారం, ఇందూరు కంఠాభరణం నీలకంఠేశ్వరాలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబైంది. ఏటా మాఘశుద్ధ సప్తమి శుక్రవారం పురస్కరించుకొని స్వామివారి శోభయాత్ర చేపట్టడం ఆలయ సంప్రదాయం. తల్లిఘోరీ వరకు ప్రత్యేకంగా అలంకరించే రథంపై ఉత్సవమూర్తులను ఊరేగించడం అనాదిగా వస్తున్న ఆచారం. వందేండ్లనాటి రథం శోభాయాత్రకు అనుకూలంగా లేకపోవడంతో ఆలయ కమిటీ నిర్ణయించిన 200మంది దాతల ద్వారా పోగు చేసిన రూ. 55లక్షలతో నూతన రథాన్ని సిద్ధం చేసింది.



ఉత్సవానికి ఆలయం వద్ద సిద్ధంగా ఉన్న నూతన రథం



### ఇందూరు సంస్కృతికి ప్రతీక



సుదీర్ఘ చరిత్ర కలిగిన నీలకంఠేశ్వరస్వామి రథసప్తమి వేడుకలు ఇందూరు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడతాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. నేడు నూతన రథంతో శోభాయాత్రను నిర్వహిస్తున్నాం. 17న ఉత్సవమూర్తులకు కోనేరులో చక్రస్నానం తదితర ప్రత్యేక పూజలు చేస్తాం.

**– సుప్రియ, జిల్లా సహాయ కమిషనర్, దేవాదాయశాఖ**

**అసెంబ్లీలో మన గళం**

## 'ఇందూరు'గా మార్చాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలతోపాటు గుర్తులు, చిహ్నాలు మారుస్తున్నట్లుగానే నిజామాబాద్ జిల్లా పేరును ఇందూరుగా మార్చాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం జీరోఅవర్‌లో నిజామాబాద్ అర్బన్ సమస్యలపై ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడారు. తమ నియోజకవర్గంలో చాలా మంది పేదలు ఉన్నందున 7వేల ఇండ్లు మంజూరు చేయాలని, అధ్వానస్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలన్నారు. క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## 'నాగమడుగు'ను త్వరగా పూర్తిచేయాలి

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్, ఫిబ్రవరి 15: నిజాంసాగర్ మండలంలో రూ.476కోట్లతో నిర్మిస్తున్న నాగమడుగు మత్తడి నిర్మాణ పనులు 15శాతం మాత్రమే పూర్తయ్యాయని, త్వరితగతిన పూర్తిచేస్తే జుక్కల్ నియోజకవర్గంలోని 41వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఆయన మాట్లాడారు. నిజాంసాగర్, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల ద్వారా 13,500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని, 30ఏండ్ల కిందట ప్రారంభించిన లెండి అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.223కోట్లు విడుదల చేసినప్పటికీ పనులు నిలిచిపోయాయని తెలిపారు. లెండి పూర్తయితే 25వేల హెక్టార్లకు సాగునీరు అందుతుందని, కౌలాస్‌నాలా మెయింటెనెన్స్‌కు నిధులు మంజూరు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రిని కోరారు. జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 28 మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఉంటే 18మంది మాత్రమే పని చేస్తున్నారని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బిచ్కుందలో వంద పడకల దవాఖాన ప్రారంభించినా ఒక్క మెడికల్ ఆఫీసర్ లేరని తెలిపారు.